నవోదయతో సమగ్ర వికాసం

పేరున్న సంస్థల్లో సీబీఎస్ఈ సిలబస్‌తో ఆరు నుంచి ప్లస్ టు వరకు ఉచితంగా చదవాలనుందా? ప్రతిభ ఉన్నప్పటికీ ఆర్థిక నేపథ్యం అడ్డుపడుతోందా? అయితే మీ లాంటివారికోసమే జవహర్ నవోదయ విద్యాలయాలు ఎదురుచూస్తున్నాయి. పరీక్షలో ప్రతిభ చూపితే చాలు.. విద్య, వసతి, భోజనం ఉచితంగా పొందవచ్చు. చదువుతోపాటు ఆటపాటలకూ, సమగ్ర వికాసానికీ ప్రాధాన్యముంటుంది. ఈ సంస్థల్లో రాబోయే విద్యా సంవత్సరం (2024-25) ఆరో తరగతిలో ప్రవేశానికి ప్రకటన వెలువడింది.

దేశవ్యాప్తంగా 661 నవోదయ విద్యాలయాలు ఏర్పాటయ్యాయి. వీటిలో ఏపీలో 15, తెలంగాణలో 9 ఉన్నాయి. ఒక్కో నవోదయ విద్యాలయంలో గరిష్ఠంగా 80 మంది విద్యార్థులకు ఆరో తరగతిలో ప్రవేశం లభిస్తుంది. 2023-2024 విద్యా సంవత్సరంలో ఐదో తరగతి చదువుతున్న వాళ్లు జవహర్ నవోదయ విద్యాలయ సెలక్షన్ టెస్టు (జేఎన్‌వీఎస్‌టీ) రాసుకోవచ్చు. అభ్యర్థులు ప్రవేశం కోరే జిల్లాలో ప్రస్తుత విద్యా సంవత్సరంలో చదువుకున్నవారై ఉండాలి. విద్యార్థులు ఒకసారి మాత్రమే పరీక్ష రాయడానికి అర్హులు. 75 శాతం సీట్లను గ్రామీణ ప్రాంతాలవారితోనే నింపుతారు. ఈ కోటాలో సీటు ఆశించే విద్యార్థులు 3, 4, 5 తరగతులను పూర్తిగా గ్రామీణ ప్రాంతంలో ఉన్న ప్రభుత్వ పాఠశాలలో లేదా గుర్తింపు పొందిన ఇతర పాఠశాలల్లో చదవాలి. అలాగే మొత్తం సీట్లలో మూడో వంతు బాలికలకు కేటాయించారు. ఎస్సీలకు 15, ఎస్టీలకు 7.5, ఓబీసీలకు 27 శాతం, దివ్యాంగులకు కొన్ని సీట్లు ఉన్నాయి. బాలబాలికలకు విడిగా వసతి సౌకర్యం కల్పిస్తారు. ఎన్‌సీసీ, స్కౌట్స్ అండ్ గైడ్స్, ఎన్ఎస్ఎస్ సౌకర్యాలు ఉన్నాయి.

పరీక్ష ఇలా

ప్రశ్నలన్నీ ఆబ్జెక్టివ్ తరహాలో వస్తాయి. విద్యార్థి తెలుగు, హిందీ, ఇంగ్లిష్.. ఇలా కోరుకున్న మాధ్యమంలో పరీక్ష రాసుకోవచ్చు. మొత్తం 100 మార్కులకు నిర్వహిస్తారు. మూడు సెక్షన్ల నుంచి 80 ఆబ్జెక్టివ్ ప్రశ్నలు ఉంటాయి. వీటిని 2 గంటల్లో పూర్తిచేయాలి. ఒక్కో ప్రశ్నకు 1. 25 మార్కులు. రుణాత్మక మార్కులు లేవు. సెక్షన్-1 మెంటల్ ఎబిలిటీ 40 ప్రశ్నలు. వీటిని గంటలో పూర్తి చేయాలి. సెక్షన్-2 అరిథ్‌మెటిక్ 20 ప్రశ్నలు. వీటికి అరగంట కేటాయించారు. సెక్షన్-3 లాంగ్వేజ్ టెస్ట్ 20 ప్రశ్నలు. 30 నిమిషాల వ్యవధి. సమాధానాలు ఓఎంఆర్ పత్రంపై గుర్తించాలి. బ్లాక్ లేదా బ్లూ పెన్ను ఉపయోగించి సరైన ఆప్షన్ సూచించే గడిని సంపూర్ణంగా దిద్దాలి. పరీక్షలో అర్హత సాధించడానికి ప్రతి సెక్షన్‌లోనూ కనీస మార్కులు పొందాలి.

ప్రశ్నల తీరు

మెంటల్ ఎబిలిటీ పరీక్షలో.. చిత్రాలు, రేఖలు, బొమ్మలపై ప్రశ్నలు వస్తాయి. ఈ సెక్షన్‌లో 10 భాగాలుంటాయి. ఒక్కో దాంట్లో నాలుగేసి చొప్పున ప్రశ్నలు వస్తాయి. ప్రశ్నల్లో కొన్ని బొమ్మలు ఇచ్చి వాటిలో భిన్నమైనది గుర్తించమనడం, ఒక అసంపూర్ణ చిత్రం లేదా గ్రాఫ్ ఇచ్చి అది సంపూర్ణం కావడానికి ఇచ్చిన ఆప్షన్లలో ఏది సరిపోతుందో పోల్చమనడం, చిత్రాలు/ బొమ్మల క్రమాన్ని ఇచ్చి తర్వాత వచ్చే దాన్ని తెలుసుకోమనడం.. ఇలా ప్రశ్నలు వస్తాయి. అరిథ్‌మెటిక్ పరీక్షలో అంకెలు, కసాగు, గసాబా, వడ్డీలు, దత్తాంశాలు, భిన్నాలు, లాభనష్టాలు, నాలుగంకెల్లో ఉండే కూడికలు, తీసివేతలు, గుణకారాలు, భాగహారాలు...మొదలైన ప్రశ్నలు ఉంటాయి. లాంగ్వేజ్ టెస్టులో పాసేజ్ ఇచ్చి ప్రశ్నలకు సమాధానం రాయమంటారు. విద్యార్థులు పాసేజ్ అర్థం చేసుకున్నారో లేదో తెలుసుకునేలా ఈ ప్రశ్నలు వస్తాయి. ప్రతి పాసేజ్ కింద ఐదేసి ప్రశ్నలు చొప్పున 4 పాసేజ్‌లు ఉంటాయి.

ఎంపికైతే...

బాలికలు, ఎస్సీ, ఎస్టీలు, అల్పాదాయ వర్గాలవారు ఆరో తరగతి నుంచి +2 వరకు ఉచితంగా చదువుతోపాటు వసతి, భోజనం పొందవచ్చు. ప్రభుత్వ ఉద్యోగుల పిల్లలైతే నవోదయ వికాస నిధికి కొంత మొత్తం చెల్లించాలి. ఉన్నత బోధనా ప్రమాణాలు నవోదయ విద్యాలయాల సొంతం. ఎనిమిదో తరగతి వరకు బోధన మాతృ/ప్రాంతీయ భాషలోనే కొనసాగిస్తారు. అనంతరం మ్యాథ్స్, సైన్స్ ఇంగ్లిష్‌లోనూ, సోషల్ హిందీలోనూ బోధిస్తారు. సీబీఎస్ఈ సిలబస్ అనుసరిస్తారు. విద్యార్థులు సర్వతోముఖాభివృద్ధికి అవకాశం ఉంటుంది. వ్యక్తిత్వ వికాసానికి ప్రాధాన్యమిస్తారు. ఇక్కడ విద్యార్థులకు నీట్, ఐఐటీ - జేఈఈ.. తదితర జాతీయ స్థాయి పరీక్షల్లో రాణించేలా శిక్షణ అందిస్తున్నారు. ఆసక్తి ఉన్న విద్యార్థులు పై తరగతులను ఇతర రాష్ట్రాల్లోని నవోదయ విద్యాలయాల్లో చదువుకోవచ్చు.

ముఖ్య వివరాలు

అర్హత: 2023-2024 విద్యా సంవత్సరంలో 5వ తరగతి చదువుతూ ఉండాలి. గతంలో పూర్తిచేసుకున్నవారు అనర్హులు.
వయసు: కనీసం పదేళ్లు నిండాలి. పన్నెండేళ్లకు మించరాదు. మే 1, 2012 - జులై 31, 2014 మధ్య జన్మించినవారే అర్హులు.
ఆన్‌లైన్ దరఖాస్తుకు చివరి తేదీ: ఆగస్టు 17 (దరఖాస్తు ఫీజు లేదు)
పరీక్ష తేదీ: జనవరి 20, 2024
వెబ్‌సైట్: https://cbseitms.rcil.gov.in/nvs/

దేశవ్యాప్తంగా ప్రతిష్ఠాత్మక విద్యాసంస్థల్లో పీజీ, పీహెచ్‌డీ కోర్సుల్లో ప్రవేశానికి నిర్వహించే గ్రాడ్యుయేట్ ఆప్టిట్యూడ్ టెస్ట్ ఇన్ ఇంజినీరింగ్ (గేట్)-2024 నోటిఫికేషన్ విడుదలైంది. జాతీయ స్థాయిలో నిర్వహించే ఈ పరీక్ష స్కోరు కొన్ని ప్రభుత్వ రంగ సంస్థల్లో ఉద్యోగాల ఎంపికకు సైతం ఉపయోగపడుతుంది. గేట్‌లో సాధించిన స్కోరును బట్టి కేంద్ర ప్రభుత్వరంగ సంస్థలు అభ్యర్థులకు ముఖాముఖి నిర్వహించి, కొలువులకు ఎంపిక చేస్తాయి.

గేట్ దాటితే... ఉన్నత విద్య..ఉద్యోగం!

GATE 2024 IISc Bengaluru

నలభై ఏళ్ల మైలురాయిని దాటిన పరీక్ష- గేట్... కొద్ది సంవత్సరాలుగా కొత్త పేపర్‌లను ప్రవేశ పెట్టడం, రెండు పేపర్‌లలో పరీక్ష రాసే అవకాశం కల్పించడం, ప్రశ్నల విధానంలో మార్పులతో ఎప్పటికప్పుడు నూతనంగా తయారవుతోంది. బహుళైచ్ఛిక ప్రశ్నలతో మొదలైన గేట్ పరీక్షకు సంఖ్యా సమాధాన ప్రశ్నలు తరువాత.. బహుళ ఎంపిక ప్రశ్నలు జోడించారు. అదేవిధంగా కొత్త పేపర్‌లను జోడిస్తున్నారు.

- ఈ సంవత్సరం కొత్తగా డేటా సైన్స్ అండ్ ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ (డీఏ) పేపర్‌ను ప్రవేశపెట్టారు.
- గేట్ స్కోరు ఆధారంగా ఐఐటీలతోపాటు ఐఐఎస్‌సీ బెంగళూరు, వివిధ ఎన్‌ఐటీలు, ప్రముఖ ఇంజినీరింగ్ కళాశాలల్లో ఇంజినీరింగ్/ టెక్నాలజీ/ ఆర్కిటెక్చర్/ ఫార్మసీ విభాగాల్లో పీజీ ప్రవేశం లభిస్తుంది.
- గేట్-2024ను కొత్తగా చేర్చిన (డీఏ) పేపర్‌తో కలిపి మొత్తం 30 పేపర్‌లలో నిర్వహించనున్నారు.
- బీహెచ్ఈఎల్, గెయిల్, ఐఓసీఎల్, ఎన్‌టీపీసీ, సీఓఏఎల్, ఎన్‌హెచ్‌ఏఐ, ఎన్‌ఎండీసీ, ఓఎన్‌జీసీ లాంటి ప్రసిద్ధ సంస్థలు ఉద్యోగ నియామకాలకు గేట్ స్కోరును ప్రామాణికంగా తీసుకుంటున్నాయి.
- గేట్-2024 పరీక్షను అభ్యర్థులు రెండు పేపర్లలో రాసే అవకాశం ఉంటుంది. విద్యార్థులు తప్పకుండా రెండు పేపర్లలో పరీక్ష రాయవలసిన అవసరం లేదు. తమ ఇష్టప్రకారం ఒకటి లేదా రెండు పేపర్లు ఎంచుకోవచ్చు.
- గేట్ స్కోరు పీజీ ప్రవేశానికి మూడు సంవత్సరాలు, పీఎస్‌యూలకు ఒకటి లేదా రెండు సంవత్సరాలు చెల్లుబాటులో ఉంటుంది.
- గేట్‌తో మన దేశంలోని అన్ని ఉన్నత విద్యాసంస్థల్లో పీజీ కోర్సుల్లో ప్రవేశంతోపాటు నెలకు రూ.12,400 ఉపకార వేతనం కూడా లభిస్తుంది.
- గేట్ స్కోరు పీహెచ్‌డీ ప్రవేశాలకు కూడా ఉపయోగపడుతుంది. అంతేకాకుండా నెలకు రూ.28,000 ఉపకార వేతనం కూడా లభిస్తుంది.

అర్హతలు: ఇంజినీరింగ్, టెక్నాలజీ, ఆర్కిటెక్చర్, సైన్స్, హ్యూమానిటీస్‌లో బ్యాచిలర్ డిగ్రీ ఉత్తీర్ణులై ఉండాలి. ప్రస్తుతం చివరి సంవత్సరం చదువుతున్న అభ్యర్థులూ దరఖాస్తు చేసుకోవచ్చు.
వయసు: అభ్యర్థులకు గరిష్ఠ వయఃపరిమితి లేదు.

పరీక్ష ఫీజు

- స్త్రీలు/ ఎస్సీ/ ఎస్టీ/ పీడబ్ల్యూడీ అభ్యర్థులకు- రూ.900.
- పురుషులు (జనరల్, ఓబీసీ), ప్రవాస భారతీయులు/ విదేశీయులకు- రూ.1800.

పరీక్ష ఫీజును ఆన్‌లైన్‌లో మాత్రమే చెల్లించాలి. రెండు పేపర్లలో పరీక్ష రాయదలిచిన అభ్యర్థులు రెండు పేపర్‌లకు విడివిడిగా పరీక్ష రుసుమును చెల్లించాలి.

ముఖ్యమైన తేదీలు

ఆన్‌లైన్ దరఖాస్తుల ప్రారంభం	24 ఆగస్టు 2023
ఆన్‌లైన్ దరఖాస్తు సమర్పణ గడువు	29 సెప్టెంబర్ 2023
గేట్ 2023 పరీక్ష తేదీలు	2024 ఫిబ్రవరి 3,4,10,11

(ఉదయం: 9:00-12:00 గంటలు, మధ్యాహ్నం 2:00-5:00 గంటలు)

ఆబ్జెక్టివ్ విధానంలో

- ఈ పరీక్షను ఆన్‌లైన్‌లో నిర్వహిస్తారు. ఆన్‌లైన్ పరీక్ష విధానంలో కంప్యూటర్ మౌస్ ఉపయోగించి సరైన ఆప్షన్ గుర్తించాలి.
- గేట్ ప్రశ్నపత్రం పూర్తిగా ఆబ్జెక్టివ్ విధానంలో ఉంటుంది. ఇందులో మూడు రకాలుగా ప్రశ్నలు అడుగుతారు.

బహుళైచ్ఛిక ప్రశ్నలు: నాలుగు ఆప్షన్‌లు ఇస్తారు. అందులో ఒకటి మాత్రమే సరైన సమాధానం. అభ్యర్థులు సరైన ఆ ఒక్క సమాధానాన్ని మాత్రమే గుర్తించాలి.
బహుళ ఎంపిక ప్రశ్నలు: ఇవి కూడా బహుళైచ్ఛిక ప్రశ్నల్లానే ఉంటాయి. కానీ ఇందులో ఒకటికంటే ఎక్కువ సరైన ఆప్షన్‌లుంటాయి. సమాధానంలో అన్ని సరైన ఆప్షన్‌లను గుర్తించాలి.
సంఖ్యా (న్యూమరికల్) సమాధాన ప్రశ్నలు: ఈ ప్రశ్నల్లో ఎలాంటి ఆప్షన్‌లు ఇవ్వరు. ఈ ప్రశ్నలకు సమాధానాలు వర్చువల్ కీబోర్డును ఉపయోగించి రాయాలి. సమాధానంలో పక్కన యూనిట్‌లను కూడా పరిగణనలోకి తీసుకుంటారు. ఈ ప్రశ్నలకు సమాధానాలు దగ్గర స్థాయిలో ఇవ్వొచ్చు. సరైన సమాధానం 92.24 అనుకుంటే 92.23 నుంచి 92.25 మధ్యలో రాసినా మార్కులు ఇస్తారు.

- పరీక్ష కేంద్రంలోకి కాలిక్యులేటర్, మొబైల్స్‌ను అనుమతించరు. అభ్యర్థులు కాలిక్యులేషన్స్ చేసుకోవడానికి ఆన్‌లైన్ వర్చువల్ కాలిక్యులేటర్ అందుబాటులో ఉంటుంది. కంప్యూటర్ మౌస్‌ని ఉపయోగించి దీన్ని వాడుకోవచ్చు.
- వర్చువల్ క్యాలిక్యులేటర్‌లో అన్ని రకాల ఫంక్షన్స్ లేకపోవడం వల్ల, తదనుగుణంగానే ప్రశ్నలు రూపొందించవచ్చు. ఇమాజినరీ ఫంక్షన్స్, హైయర్ ఆర్డర్ సమీకరణాలకు సంబంధించిన ప్రశ్నలు అడగకపోవచ్చు.

పరీక్ష విధానం

- గేట్ ప్రశ్నపత్రంలో మొత్తం 100 మార్కులకు 65 ప్రశ్నలు ఉంటాయి. పరీక్ష వ్యవధి మూడు గంటలు. ప్రశ్నపత్రంలో రెండు విభాగాలుంటాయి.

విభాగం-1: (జనరల్ ఆప్టిట్యూడ్): 15 మార్కులు

- ఇందులో పది ప్రశ్నలుంటాయి. ఐదు ఒక మార్కు ప్రశ్నలు, మరో ఐదు రెండు మార్కులు ప్రశ్నలు. ఈ విభాగంలోని నాలుగు నుంచి ఐదు ప్రశ్నలు ఇంగ్లిష్ సంబంధితం (వెర్బల్ ఎబిలిటీ). మిగతా ప్రశ్నలు క్వాంటిటేటివ్‌కు సంబంధించినవి ఇవ్వొచ్చు.
- రోజూ వార్తాపత్రికలు చదవడం, ఇతర పోటీ పరీక్షల (ఉదా: క్యాట్) గత ప్రశ్నపత్రాలు సాధన చేస్తే ఈ విభాగంలో మంచి మార్కులు వస్తాయి.

నెగెటివ్ మార్కులతో జాగ్రత్త:

- గేట్‌లో ఒక తప్పు జవాబుకు 33.33 శాతం రుణాత్మక మార్కులుంటాయి. అంటే ఒక మార్కు ప్రశ్నలకు 1/3, రెండు మార్కుల వాటికి 2/3 చొప్పున మార్కులు తగ్గుతాయి. న్యూమరికల్, బహుళ ఎంపిక ప్రశ్నలకు రుణాత్మక మార్కులు ఉండవు.

విభాగం-2: (ఇంజినీరింగ్ సబ్జెక్టు): 85 మార్కులు

- ఈ విభాగంలో 55 ప్రశ్నలుంటాయి. ఇందులో 25 ఒక మార్కు ప్రశ్నలు, 30 రెండు మార్కుల ప్రశ్నలు ఉంటాయి.
- గణితం నుంచి 10 - 15 మార్కులు. అయితే ఈ విభాగంలోని ప్రశ్నలు శుద్ధ గణితంలా ఉండవు. ఇంజినీరింగ్ అప్లికేషన్‌తో ఉంటాయి.
- ప్రశ్నలు ఆయా రంగాల్లోని నూతన ఆవిష్కరణలను దృష్టిలో పెట్టుకుని ఉంటాయి.

సన్నద్ధత వ్యూహం

ముందు పరీక్ష సిలబస్‌ను క్షుణ్ణంగా పరిశీలించాలి. దీనివల్ల ఏ సబ్జెక్టుల్లో ఏయే అంశాలపై ఎక్కువ దృష్టి పెట్టాలో అవగతం అవుతుంది. దీనితోపాటు పరీక్ష విధానాన్ని అర్థం చేసుకోవడం కూడా ముఖ్యమే. దీనివల్ల పరీక్షలోని విభాగాలపైన, ప్రశ్నల సాధనపైన స్పష్టత వస్తుంది.

■ గేట్-2024 ఫిబ్రవరిలో జరుగుతుంది. ఇప్పుడున్న సమయంలో సన్నద్ధత, సాధన పూర్తిచేసేలా ప్రణాళికను రూపొందించాలి. ప్రణాళికలో పునశ్చరణకు ముఖ్య సమయం కేటాయించాలి.

■ సన్నద్ధతను త్వరగా మొదలుపెట్టడం చాలా ముఖ్యం. దీనివల్ల సిలబస్‌లో ఉన్న కాన్సెప్ట్స్, విషయాలను ఎక్కువగా సాధన చేసుకోవచ్చు.

■ గత గేట్ ప్రశ్నపత్రాలను తప్పనిసరిగా ప్రాక్టీస్ చేయాలి. దీనివల్ల ఏ అంశాలపై, ఏ కాన్సెప్ట్‌లకు ఎలాంటి ప్రాధాన్యం ఇచ్చారో, ఏ అంశాలపై ఎక్కువ దృష్టి పెట్టాలో తెలుస్తుంది.

■ ఇంకా ఈఎస్ఈ, ఇస్రో, పీఎస్‌యూల ప్రశ్నపత్రాలను సాధన చేయాలి. దీనివల్ల ఒక అంశాన్ని ఎన్ని విధాలుగా అడగడానికి అవకాశం ఉందో తెలుస్తుంది.

■ మంచి ప్రామాణిక పాఠ్య పుస్తకాలు/ స్టడీ మెటీరియల్ ఎంచుకోవడం ప్రధానం. ఒకే సబ్జెక్టుపై ఒకటికి మించి వివిధ రకాల పుస్తకాలను చదవకపోవడమే మంచిది.

■ గేట్‌లో అన్ని సబ్జెక్టులకూ, అన్ని అంశాలకూ ప్రాధాన్యం ఉంటుంది. కాబట్టి సన్నద్ధతలో అంశాలన్నింటికీ ప్రాధాన్యం ఇవ్వాలి.

■ ప్రతి సబ్జెక్టు, ప్రతి చాప్టర్‌కు సంబంధించిన అంశాలను, చిన్న చిన్న పట్టికలను సంక్షిప్తంగా తయారుచేసుకోవాలి.

■ క్లిష్టమైన, సాధారణ, అతి సాధారణమైన అంశాలకు సన్నద్ధతలో సమాన ప్రాధాన్యం ఇవ్వాలి.

■ ప్రతి చాప్టర్, సబ్జెక్ట్ చదివిన తర్వాత దానికి సంబంధించి ప్రముఖ విద్యాసంస్థలు అందించే ఆన్‌లైన్ టెస్టులను రాయాలి. సన్నద్ధత పూర్తయ్యాక మాక్ టెస్టులు రాయాలి.

■ ఎన్‌టీపీఎల్ పాఠాలు విద్యార్థులకు ప్రాథమిక అంశాల అవగాహనకు బాగా ఉపయోగపడతాయి. అలాగే విశ్లేషణాత్మక ప్రశ్నలకు సమాధానాలు రాయడానికి సహాయపడతాయి.

■ గత సంవత్సరపు ప్రశ్నపత్రాల్లో ఒక ప్రశ్నపత్రాన్ని పరీక్షకు కేటాయించిన సమయంలో సమాధానాలు రాయడానికి ప్రయత్నిస్తే.. ఏ స్థాయిలో ఉన్నారో అభ్యర్థులకు అర్థమవుతుంది.

తరచూ చేసే తప్పిదాలు

చాలామంది అభ్యర్థులు సన్నద్ధత మొదట్లోనే పరీక్ష సిలబస్‌ను చూసి భయపడుతుంటారు. నాలుగేళ్ల ఇంజినీరింగ్ సిలబస్‌తో పోలిస్తే.. గేట్ పరీక్ష సిలబస్ 60 శాతం మాత్రమే. మొత్తం ఇంజినీరింగ్ బ్రాంచ్‌కి సంబంధించిన మూలాలు, నూతన పోకడలు మాత్రమే గేట్ సిలబస్‌లో ఉంటాయి. ఒక పెద్ద కొండ సైతం రోజుకో బండ తొలగిస్తే కొంత కాలానికి మటుమాయం అవుతుంది. రోజుకు రెండు నుంచి మూడు గంటలు ఒక్కో కాన్సెప్ట్ అర్థం చేసుకుంటూ ముందుకు వెళితే.. అందుబాటులో ఉన్న సమయంలో సిలబస్‌ను విజయవంతంగా పూర్తిచేసుకోవచ్చు.

- కొంతమంది విద్యార్థులు చదివిన అన్ని అంశాలూ గుర్తుంటాయని భావించి.. పునశ్చరణను విస్మరిస్తారు. ఇది పొరపాటు. చదివిన ప్రతి అంశాన్నీ తప్పనిసరిగా పునశ్చరణ చేయాలి. పరీక్ష సాధన సమయంలో తయారుచేసుకున్న చిన్న చిన్న పట్టికలను ఈ పునశ్చరణలో సద్వినియోగం చేసుకోవాలి.
- కఠినమైన అంశాలు అర్థంకాకపోతేనో, మాక్ టెస్టుల్లో మార్కులు తక్కువ వస్తేనో.. కొంతమంది తాము గేట్‌లో విజయం సాధించలేమని నిరుత్సాహపడతారు. అలాకాకుండా మాక్ టెస్ట్‌లలో తప్పిదాలను గుర్తించి.. కఠినమైన అంశాలను మరోసారి చదవాలి.

ఇతర అభ్యర్థులతో బృందాలుగా ఏర్పడి చదివితే ఎలాంటి కఠినమైన అంశాలైనా అవగతం అవుతాయి.

అపోహలు మాత్రమే

గేట్‌కు సంబంధించి కొన్ని అభిప్రాయాలు ప్రచారంలో ఉన్నాయి. అవి ఎంతవరకూ నిజమో తెలుసుకుందాం.

✗ **గేట్‌లో కేవలం ఐఐటీ, ఎన్‌ఐటీ విద్యార్థులే విజేతలు అవుతారు. గ్రామీణ నేపథ్యం ఉన్నవారికి ఈ పరీక్ష కష్టం.**

✓ ఇది పూర్తిగా అవాస్తవం. గత విజేతల వివరాలు విశ్లేషిస్తే చాలామంది సాధారణ కాలేజీల్లో చదివినవారే అని తెలుస్తుంది. ఎంతోమంది ఇంటర్మీడియట్ వరకూ మాతృభాషలో చదివిన గ్రామీణ నేపథ్యం కలిగినవారే. పేదరికం అసలే అడ్డు కాదు.

✗ **కేవలం బీటెక్‌లోని మెరిట్ విద్యార్థులే గేట్‌లో విజయం సాధిస్తారు.**

✓ ఇది నిజం కాదు. పట్టుదలతో కృషిచేసి.. గొప్ప ర్యాంకులు సాధించినవారిలో బీటెక్ సాధారణ పాస్, సెకండ్ క్లాస్ ఉత్తీర్ణులు ఎందరో ఉన్నారు.

✗ **గేట్ గెలవాలంటే ఇంజినీరింగ్ తర్వాత కనీసం ఒక సంవత్సరం పూర్తిగా చదవాలి.**

✓ ఇది కూడా నిజం కాదు. గత గేట్ విజేతలను పరిశీలిస్తే.. ఇంజినీరింగ్ చదువుతున్న విద్యార్థులు ఎంతోమంది ఉన్నారు.



- ప్రొ. వై.వి. గోపాలకృష్ణమూర్తి
సీఎండీ, ఏస్ ఇంజినీరింగ్ అకాడెమీ

సరైన నిర్ణయమేనా?

హిస్టరీ అండ్ టూరిజంలో పీజీ చేశాను. డిగ్రీలో హిస్టరీ, ఎకనామిక్స్, పొలిటికల్ సైన్స్ చదివాను. టూరిజం ఉద్యోగం చేయాలనుకుంటున్నా. నా నిర్ణయం సరైనదేనా? - పి.బాలకృష్ణ

■ మీకు నచ్చిన ఉద్యోగం చేయడం ఎప్పుడూ శ్రేయస్కరం. చదివిన చదువుకు సంబంధించిన ఉద్యోగం చేయడం అదృష్టం కూడా! ప్రస్తుత పరిస్థితుల్లో చాలా మంది చదివిన కోర్సుకూ, చేయాలనుకొన్న - చేస్తున్న కొలువుకూ ఎలాంటి సంబంధం ఉండట్లేదు. దీంతో కొందరు ఉద్యోగాలు మారే ప్రయత్నాలు కూడా చేస్తుంటారు. టూరిజం రంగంలో ఉపాధి అవకాశాలు ఎక్కువగా ఉన్నాయి. మీరు హిస్టరీ అండ్ టూరిజంలో పీజీ చేశారు కాబట్టి ఎంబీఏ ట్రావెల్ అండ్ టూరిజం, బీబీఏ టూరిజం చదివినవారితో పోటీ పడాల్సి ఉంటుంది. మీరు ఈ రంగంలో రాణించాలంటే- కంప్యూటర్, కమ్యూనికేషన్ నైపుణ్యాలను పెంపొందించుకోండి. అవకాశం ఉంటే తెలుగు, ఇంగ్లిష్‌లతో పాటు హిందీ, మరో విదేశీ భాషను నేర్చుకొనే ప్రయత్నం చేయండి. టూరిజం రంగంలోనే స్థిరపడాలనుకొంటే ఎంబీఏ ట్రావెల్ అండ్ టూరిజం మేనేజ్‌మెంట్ చదివే ప్రయత్నం కూడా చేయండి.

- ప్రొ. బెల్లంకొండ రాజశేఖర్, కెరియర్ కౌన్సెలర్

నోటిఫికేషన్స్

ప్రవేశాలు

జామ్ - 2024

21 ఐఐటీల్లో ఎమ్మెస్సీ, ఎమ్మెస్సీ-పీహెచ్‌డీ (డ్యూయల్ డిగ్రీ) సీట్ల భర్తీకి నిర్వహించే జాయింట్ అడ్మిషన్ టెస్ట్ ఫర్ మాస్టర్స్ (జామ్-2024) ప్రకటన వెలువడింది.
అర్హత: నిర్దేశిత విభాగాల్లో డిగ్రీ ఉత్తీర్ణులు. ఆఖరు సంవత్సరం కోర్సులు చదువుతున్నవారూ అర్హులే.
సబ్జెక్టులు: బయోటెక్నాలజీ, కెమిస్ట్రీ, ఎకనామిక్స్, జియాలజీ, మ్యాథ్స్, మ్యాథమెటికల్ స్టాటిస్టిక్స్, ఫిజిక్స్.
దరఖాస్తు ఫీజు: మహిళలు, ఎస్సీ, ఎస్టీ, దివ్యాంగులకు ఒక పేపర్‌కి రూ.900. రెండు పేపర్లకు రూ.1250. మిగిలిన అభ్యర్థులందరికీ ఒక పేపర్‌కు రూ.1800. రెండు పేపర్లకు రూ.2500
రిజిస్ట్రేషన్ ప్రారంభం: 05-09-2023.
రిజిస్ట్రేషన్ గడువు: 13-10-2023.
పరీక్ష తేదీ: 11-02-2024.
వెబ్‌సైట్: https://jam.iitm.ac.in/

ఆర్ఐఎంసీలో ప్రవేశాలు

భారత ప్రభుత్వ రక్షణ మంత్రిత్వశాఖకు చెందిన ఉత్తరాఖండ్ రాష్ట్రం డెహ్రాడూన్‌లోని రాష్ట్రీయ ఇండియన్ మిలిటరీ కాలేజీ (ఆర్ఐఎంసీ)లో జులై-2024 టర్మ్ ఎనిమిదో తరగతి ప్రవేశాలకు తెలంగాణ రాష్ట్రానికి చెందిన బాలురు, బాలికల నుంచి టీఎస్‌పీఎస్సీ దరఖాస్తులు కోరుతోంది.
అర్హత: గుర్తింపు పొందిన పాఠశాల నుంచి 2024 జులై నాటికి ఏడో తరగతి చదువుతున్న లేదా ఏడో తరగతి ఉత్తీర్ణులైన విద్యార్థులు అర్హులు. **వయసు:** 01.07.2024 నాటికి పదకొండున్నర ఏళ్లకు తగ్గకుండా పదమూడేళ్లకు మించకుండా ఉండాలి. **ఎంపిక:** రాత పరీక్ష, వైవా వోస్ ఆధారంగా. **దరఖాస్తు ఫీజు:** జనరల్ అభ్యర్థులకు రూ.600, ఎస్సీ/ ఎస్టీ అభ్యర్థులు రూ.555 చెల్లించాలి.

- **దరఖాస్తుకు చివరి తేదీ:** 15.10.2023.
- **పరీక్ష తేదీ:** 02-12-2023. **వెబ్‌సైట్:** https://websitenew.tspsc.gov.in/public/rimc

ఏపీ కళాశాలల్లో డీఫార్మసీ

విజయవాడలోని ఆంధ్రప్రదేశ్ సాంకేతిక విద్య విభాగం నియంత్రణలోని ప్రభుత్వ/ ఎయిడెడ్/ ప్రైవేట్ అన్ ఎయిడెడ్ ఫార్మసీ కళాశాలల్లో 2023-24 విద్యా సంవత్సరానికి రెండేళ్ల డిప్లొమా ఇన్ ఫార్మసీ (డీఫార్మసీ) కోర్సు ప్రవేశ ప్రకటన వెలువడింది.
అర్హత: ఇంటర్మీడియట్(బైపీసీ లేదా ఎంపీసీ) లేదా సీబీఎస్ఈ, ఐసీఎస్సీలో పన్నెండేళ్ల హయ్యర్ సెకండరీ ఎడ్యుకేషన్ బోర్డు ఎగ్జామ్ ఉత్తీర్ణులై ఉండాలి. **ఎంపిక:** ఇంటర్ మార్కులు, రూల్ ఆఫ్ రిజర్వేషన్ ఆధారంగా.
ఆన్‌లైన్ దరఖాస్తుకు చివరి తేదీ: 19-08-2023. **తరగతుల ప్రారంభం:** 11-09-2023. **వెబ్‌సైట్:** https://apsbtet.in/pharmacy/

వాక్ ఇన్

నిట్ వరంగల్‌లో విజిటింగ్ ఫ్యాకల్టీ

వరంగల్‌లోని నేషనల్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ తాత్కాలిక ప్రాతిపదికన ఆగస్టు-డిసెంబర్ 2023 కాల పరిమితికి వివిధ విభాగాల్లో విజిటింగ్ ఫ్యాకల్టీ ఖాళీలను వాక్ ఇన్ ఇంటర్వ్యూ ద్వారా భర్తీ చేస్తోంది.
1. అసిస్టెంట్ ప్రొఫెసర్ 2. అసోసియేట్ ప్రొఫెసర్ 3. ప్రొఫెసర్
అర్హతలు: సంబంధిత విభాగంలో పీహెచ్‌డీ డిగ్రీ
వయసు: అసిస్టెంట్ ప్రొఫెసర్ 40 సంవత్సరాలు; అసోసియేట్ ప్రొఫెసర్ 45 సంవత్సరాలు; ప్రొఫెసర్ 50 సంవత్సరాలు మించకూడదు.
వాక్-ఇన్-ఇంటర్వ్యూ తేదీ: 20.08.2023.
వెబ్‌సైట్: https://www.nitw.ac.in/